# వెన్నెలలో కన్నీరు

"శకుంతలా!

నక్షత్రాలు వెన్నెలతో ఆటలాడుకునేవేళ, చంద్రుడు సిగ్గుతో చిరుమబ్బుల చాటుకు పరువులెత్తేవేళ, అర్థం కాని పిచ్చిగీతల్లా విడిపోయిన భావాలను పొదివిపట్టుకొని, నీ కీ ఉత్తరం ప్రారంభిస్తున్నాను. ఇన్నాళ్ళకు—రెండేళ్ళ తరువాత కాదు! రెండు యుగాల తరువాత—నా అన్వేషణ ఫలించింది. అందుకే ఈ లేఖ వ్రాస్తున్నా!

నా ప్రక్కనున్న "నైట్‌క్వీన్" పొద సువాసనలతో మత్తెక్కిస్తోంది.

ఇలాటి సమయంలో నువ్వుకాక ఇంకెవరు గుర్తుకొస్తారు?

విశాఖపట్నం సముద్రపు ఒడ్డున కూర్చొని, నీ చిలిపి ముఖంలోకి తదేకంగా చూస్తూ, గంటలను నిమిషాలుగా గడిపిన నాకు—నువ్వులేని ఆ "బీచ్" ఎడారిలా తయారయింది. చల్లనిగాలి వీస్తూవుంటే నీవు ప్రక్కనవున్నప్పుడు పొందిన ఆనందాన్ని పొందలేక పోతున్నాను.

నువ్వెళ్ళిపోయాక—నేనెందుకిలా అయిపోయాను?

నన్నుచూస్తే నాకే దుఃఖం ముంచుకొస్తోంది.

వేదనలో మునిగిపోతే నేను వ్రాయాలనుకున్నది వ్రాయలేను!

ఆలాపనలేని నా హృదయ వీణాతంత్రులను, నీ సుతిమెత్తని వేళ్ళతో బిగించి, సున్నితంగా తాకి, మంజుల గానాన్ని ఆలాపింపజేశావ్! నువ్వు వెళ్ళిపోయాక ఆవీణమళ్ళీ మూగపోయింది. చీకటితో, వేదనతో నిండిపోయి; నిశ్శబ్దం ఆవరించుకున్న నా మనో సామ్రాజ్యంలో, మళ్ళీ ఆవీణా నాదాన్ని పలికించి; ఆనందంతో —కాదు! అమృతంతో నింపు.

నువ్వు నాదానివన్న ఆశతోనే ఇంతకాలంనుండి జీవిస్తున్నాను. నా మెత్తని మనసును, నీసుతిమెత్తని పాదాలతో త్రొక్కి నడిచిపోయినా, ఆ పాదాలగుర్తులే నా మధురానుభూతులకు చిహ్నాలుగా మిగిలిపోయాయి!

ఇన్నాళ్ళుగా చేసిన అన్వేషణలో ఈనాటికి కృతకృత్యుడనయ్యాను. ఒక్కసారి సాయంత్రం వీలుచేసుకొని రా! తప్పక వస్తావుకదూ. డాబామీద కూర్చొని నీకోసం వేయికళ్ళతో ఎదురుచూస్తూ వుంటాను. నీకోసమే బ్రతుకుతున్న నేను— నిన్ను రమ్మని అర్థిస్తున్నాను.”

(రవి)

ఉత్తరం వ్రాయటం ముగించి మళ్ళీ ఒక్కసారి చదువుకొని, సంతృప్తిగా నిట్టూర్చి కవరులో వుంచి పోస్టుచేశాడు.

♦ ♦ ♦ ♦

చల్లగాలి వీస్తోంది. డాబా పిట్టగోడమీద కాళ్ళతో ముఖందాచుకొని సావకాశంగా కూర్చున్న రవి మెత్తగా కళ్ళు మూసుకున్నాడు.

ఉత్తరం పోస్టుచేశాడుగాని, "శకుంతల వస్తుందని నమ్మకం లేదు" అతనికి! అంతలోనే మెట్లమీద మెత్తగా పాదాలధ్వని వినిపించింది. రాదనుకున్న శకుంతల వచ్చింది.

తెల్లని మల్లెపువ్వులాటి చీరకట్టుకొని, జడలో ఎర్రని గులాబీ తురుముకొని, హంసలా—ఊహు! దివినుండి దిగి వచ్చిన దేవకన్యలా—వచ్చింది!

వస్తూనే రవికి దగ్గరగావున్న కుర్చీలో కూర్చుంది.

మంచులో అద్దిన తెల్లగులాబీలావున్న ఆమె ముఖాన్ని ఆరేకంగా చూస్తూ చిరునవ్వు చిందించాడు రవి.

చంద్రుడు బంతిలా మేఘాలలో తేలిపోతున్నాడు. చందమామను తిలకిస్తూ కూర్చోవటమన్నా, "పడుచుపిల్ల వేళ్ళతో స్పృజిస్తున్నట్లు" చెంపలను తాకే చల్లగాలిని అనుభవించటమన్నా, రవికి చాలా ఇష్టం!

శకుంతల చంద్రునికంటే, చల్లగాలికంటె బాగుంటుందనుకున్నాడు రవి. చల్లగాలికి రేగిన ఆమె ముంగురులు సుతారంగా కనురెప్పలను తాకుతున్నాయి.

"రవి"కి సమాధానంగా తన పెదవులను సున్నితంగా కదిల్చి చిరునవ్వు ప్రవహింపజేసింది శకుంతల!

చలించిపోతూ అన్నాడు రవి. "నువ్వు అలా పెదవులను తడిచేసుకొంటూ నవ్వకు ప్లీజ్!"

రెండేళ్ళతరువాత కలుసుకున్న ఆమెతో అంతకంటే సంభాషణ ఎలా ప్రారంభించాలో తెలియలేదు అతనికి. ఆమెను చూశాక, ఈ మధ్య ఆమె అన్వేషణలో రెండు సంవత్సరాలు గడిచిపోయిన సంగతే మరిచిపోయాడు.

"కనీసం నవ్వకునేందుకయినా నాపై నాకు అధికారం లేదూ!" శ్రుతిచేసిన విపంచిలా నవ్వుతూ అంది. "నవ్వకునేందుకు అధికారం నాకు వదిలేసి మిగిలిన ఆధిపత్యం నీవు తీసుకో!" అన్న భావం ఆమె మాటల్లో స్ఫురించింది.

"శకుంతలా! నీపై అధికారం చెలాయించలేను. కాని అర్థిస్తున్నాను. నువ్వు మాత్రం అలా నవ్వకు! అలాంటి నవ్వుతోనే విశాఖపట్నం సముద్రపు ఒడ్డున కూర్చున్న నన్ను పిచ్చెక్కించావ్! ఆ నవ్వుతోనే నిన్ను జన్మలో మరిచిపోలేకుండా చేశావ్. ఆ సుతిమెత్తని నవ్వుతోనే నన్ను నేను మరిచిపోయేట్లు చేస్తున్నావ్. ఈ రెండేళ్ళలో నీ ముఖాన్ని మరిచి పోయినా, ఆ నవ్వుని మాత్రం మరిచిపోలేకపోతున్నా! కనుక—ప్లీజ్!"

"నువ్వొట్టి పిచ్చిమనిషివి" మళ్ళీ నవ్వుతూ అంది—

ఇరవై ఏళ్ళ వయసుకే; వయసునుమించిన అనుభవం, అనుభవాన్ని మించిన ఆరిందాతనం గడించిన శకుంతల.

"నీ కంటికి నేను ఎలా కనుపించినా ఫరవాలేదు! నువ్వు ఎలా మాట్లాడినా నాకు తృప్తిగానే వుంటుంది. ఈ రెండేళ్ళనుండీ నేను చేసిన ప్రయత్నం వృథాకాలేదు. అసలు ఈ జన్మలో మళ్ళీ నిన్ను చూడలేనేమోననుకున్నాను. ఈ హైదరాబాద్ ఆంధ్రుల పాలిట, ఆంధ్రభాషపాలిట, అభాగ్య నగరమే అయినా; నా పాలిట మాత్రం భాగ్య నగరమే అయింది. నువ్వీ రోజున కనబడకపోతే, నువ్వు చెప్పినట్లు పిచ్చిమనిషిగా మారిపోయివుండేవాడిని" మాటలు ఆపి నిట్టూర్చాడు.

"అసలు విషయం చెప్పు! నువ్వు వ్రాసిన ఉత్తరం అదృష్టంకొద్దీ నా చేతులలో పడింది. లేకపోతే పరిస్థితులు ఎలా ఉండేవో ఆలోచించావా?" నిశితంగా అతని కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

అంతవరకూ ఆ విషయం జ్ఞప్తికి రానందున నొచ్చుకున్నాడు.

"క్షమించు శకుంతలా! ఆ విషయం ఆలోచించలేకపోయాను. కారణం—ఆలోచించలేని స్థితిలో వుండటమే" రెండేళ్ళ తరువాత కలుసుకున్నాం. ఎన్నో విషయాలు చెప్పాలనుకున్నాను! కాని నిన్ను చూస్తూవుంటె అసలు నాకు మాట్లాడటమే రాదు. నీ చిలిపి కళ్ళతో, అందమయిన

ముఖంతో సంభాషించగలను కాని నీతో సంభాషించ లేను. నిన్ను చూస్తూంటే మనసు ఏదో మత్తుతో నిండిపోతోంది. కాని చెప్పేస్తున్నా! నిన్ను నేను ప్రేమిస్తున్నాను" మాటలు ఆపి తలవంచుకున్నాడు రవి.

"నువ్వు నన్ను ప్రేమించటంలేదని నాకెప్పుడూ అను మానంలేదు. నేను నిన్ను ప్రేమించటంలేదంటే మాత్రం నమ్మగలవా? అమాయకమయిన ముఖంతో వున్న నిన్ను చూస్తూంటే......"

మాటలు ఆపి నవ్వింది శకుంతల!

సుధాంశునిలోని వెన్నెల ధారలుగా వర్షిస్తున్నట్లు, లోకాన్నంతటినీ పరిహసిస్తున్నట్లు నవ్వింది.

రవి మూతిముడుచుకున్నాడు. అతనికి శకుంతల ప్రవ ర్తన అంతు తెలియటం లేదు.

ఈ ఆడవాళ్ళే ఇంత! "శకుంతల" తనలోని అమాయ కత్వాన్ని ప్రేమిస్తోందట! మగతనాన్ని ప్రేమిస్తున్నట్లు చెప్ప కూడదూ!" అని మనసులో అనుకొని తరువాత ప్రకాశంగా అన్నాడు. "శకూ! నువ్వు నాకు కావాలి! ఆజన్మాంతం నాతోనే వుండిపోవాలి."

పురుషుడు "స్త్రీ"ని ప్రేమిస్తున్నట్లు వ్యక్తంచేయటానికి అంకంటె ఎలా మాట్లాడాలో తెలియలేదు అతనికి.

"అదెలా కుదురుతుందీ! సంఘం ఒప్పుకోవద్దూ!"

ఈ సంఘాన్ని మనం సృష్టించుకున్నాం గాని, సంఘం మనలను సృష్టించలేదు. ఈ పాడు సంఘాన్ని వదిలి ఎక్కడి కయినా పారిపోదాం" ఆవేశంగా అన్నాడు.

"ఈమధ్య "చలం" నవలలు బాగా చదివినట్లున్నావే" వింతగా నవ్వుతోంది శకుంతల.

చిత్తరపోయి ఆమెవైపు చూశాడు రవి. ప్రతి మాటలోనూ తనే ఓడిపోతున్నాడు.

"అయితే నువ్వు నన్ను ప్రేమించటంలేదూ" ఊపిరి బిగబట్టుకొని అడిగాడు.

"రవీ! నువ్వంటే నాకెప్పుడూ ఇష్టమే" శకుంతల తల దించుకొని కాలివ్రేళ్ళతో నేలమీద రాస్తూ అంది.

"శకూ! ఇన్ని మాటలు చెప్తూ నన్నెందుకిలా హింసిస్తావ్! "స్త్రీ" మనసు ఎందుకింత కఠినంగా మారిపోతుంది? ఆనాడు, విశాఖపట్నం "బీచ్" లో నీ ఒడిలో తలదాచుకొని– మనసులోని కోరికలలా ఉవ్వెత్తుగా పడిలేస్తున్న కెరటాలను చూస్తూ—జీవితమంతా అలాగే గడిచిపోతుందనుకున్నాను. కాని ఆ ఊహాలు భవిష్యత్తులో ఇలా చెదిరిపోతాయనీ, ముళ్ళ పొదలుగా మారిపోతాయనీ మాత్రం అనుకోలేదు. నన్నెందుకిలా మార్చేశావ్? నువ్వు లేకుండా నేను బ్రతకలేను"

"క్షమించు రవీ! నేను అశక్తురాలిని! నన్ను మరిచిపో"

"నీ మనసు ఇంత కఠినమని గుర్తించలేక పోయాను శకుంతలా"

"రవీ! నా మనసు కఠినమో, నవనీతమో నాకంటే నీకే ఎక్కువగా తెలుసును. నామీద నాకున్న స్వాతంత్ర్యాన్ని కోల్పోయి, విధి చేతికి చిక్కిన నేను ఇంతకన్న ఎక్కువ చెప్పలేను. నన్ను మరిచిపో! నేను వెళ్ళొస్తాను" బరువుగా కుర్చీలోంచి లేచింది.

రవి అప్రతిభుడయి పోయాడు!

"వెళ్ళిపోతున్నావా, శకుంతలా!" గద్గదస్వరంతో అన్నాడు.

అంతవరకూ పొదివిపట్టుకున్న శకుంతల మనసు ఒక్కసారిగా ఎదురు తిరిగింది.

చెదురుగా ఇటూ అటూ పరికించి చూసింది.

తడబడే అడుగులతో మెల్లగా రవివద్దకువచ్చి, అతని ముఖాన్ని రెండుచేతులతో అదిమి దగ్గరకు తీసుకొని, నూట మూడు డిగ్రీల వేడితో కాలిపోతున్న తన పెదాలను అతని పెదాలపై క్షణంసేపు ఆన్చివుంచింది. ఆమె నేత్రాలనుండి కెంపుల్లా వర్షించిన కన్నీరు అతని చెంపలను తడిపివేసింది.

అంతలోనే తొట్రుపడి "వస్తాను రవీ! ఆయన క్లబ్బునుంచివచ్చే వేళయింది. నన్ను క్షమించు!" చీర చెరగుతో కళ్ళు అద్దుకొని గబగబా మెట్లుదిగి పోయింది.

ఏదో మెరుపుతీగ మాయమయినట్లు అన్పించిది రవికి!

శకుంతలకు వివాహమయి పోయిందని అప్పటికికాని అర్థంకాని అతనికి పెద్దగా "షాక్" తిన్నట్లయింది.

ఆమె వెళ్ళిపోతూ తన పెదవులనూ, చెంపలనూ తడి చేసి మరీ ఎందుకు వెళ్ళిపోయిందో మాత్రం ఎంత ఆలోచించినా అర్థంకాలేదు.

బహుశః—శకుంతలను అడిగినా ఆమెకూడా చెప్ప లేదేమో!!

★ ★ ★